# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశవ్యాప్తంగా ప్రస్తుతం 56 గిగావాట్లకుపైగా పవన శక్తి ఉత్పత్తి అవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ వేసవికాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు హిమాచల్ ప్రదేశ్ చేరుకుంటారు.
- ❖ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండవ విడత ప్రచారానికి గడువు రేపు సాయంత్రంతో ముగియనుంది.
- ❖ చెన్నై వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = =

అణుశక్తి పరిశోధనల్లో భారత్ మరో ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమిళనాడులోని కల్పకంలో ఉన్న 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ దేశ దీర్ఘకాలిక అణు వ్యూహంలో ఓ మూలస్తంభమని అభివర్ణించారు. ఈ విషయంలో మన అణు శాస్త్రవేత్తలు భారతదేశ గౌరవాన్ని మరింత పెంచారని కొనియాడారు. `మన్ కీ బాత్` కార్యక్రమం 133వ సంచికలో నరేంద్ర మోదీ ఈరోజు మాట్లాడుతూ... ఈ అణు రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం గర్వించదగ్గ విషయమన్నారు. పౌర అణు కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు మరింత ముందుకు తీసుకువెళ్తున్నారని, వారి కృషి దేశ నిర్మాణానికి గణనీయమైన తోడ్పాటు అందిస్తోందని తెలిపారు.

(వాయిస్ 30 సెకన్లు)

ఇక మరోవైపు పవన శక్తి ఉత్పత్తిలోనూ భారత్ మరో మైలురాయి దాటిందని ప్రధాని చెప్పారు. దేశం ముందుకు వెళ్లాలంటే సౌర, పవన శక్తులు చాలా ముఖ్యమన్నారు. పునరుత్పాదక విద్యుత్ వల్ల భవిష్యత్ భద్రంగా ఉంటుందన్నారు. పవన శక్తి ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 56 గిగా వాట్లకుపైగా పవన శక్తిని ఉత్పత్తి చేస్తున్నామని ప్రధానమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

వేసవికాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి ఐదు రోజుల పాటూ హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా షిమ్లాలోని మశోబ్రాలో ఉన్న `రాష్ట్రపతి నివాస్`లో బస చేస్తారు. మంగళవారం షిమ్లాలోని `లోక్ భవన్`లో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ కవీందర్ గుప్తా ఏర్పాటు చేసే విందులో రాష్ట్రపతి పాల్గొంటారు. ఇక బుధవారం `అటల్ టన్నెల్`ను సందర్శిస్తారు. పాలంపూర్‌లోని `చౌదరి సర్వాన్ కుమార్ హిమాచల్ ప్రదేశ్ కృషి విశ్వవిద్యాలయం` స్నాతకోత్సవంలో ద్రౌపది ముర్ము  గురువారం పాల్గొంటారు. పర్యటనలో చివరి రోజున, అంటే వచ్చే నెల 1వ తేదీన, షిమ్లాలోని `ఆర్మీ ట్రైనింగ్ కమాండ్`ను కూడా రాష్ట్రపతి సందర్శిస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు రెండవ విడత పోలింగ్ ఏప్రిల్ 29న బుధవారం జరగనుంది. రేపు సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి గడువు ముగియడంతో రాజకీయ పార్టీలు తమ ప్రచార కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. బోంగావ్‌లోని ఠాకూర్‌నగర్‌లో జరిగే ర్యాలీలో రేపు పాల్గొంటారు. ఆ తర్వాత సాయంత్రం, ఉత్తర కోల్‌కతాలోని బీకే పాల్ అవెన్యూ నుండి ఖన్నా క్రాసింగ్ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. మరో బీజేపీ నాయకులు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తేహట్టా, అనూలియాలలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గమైన భవానిపూర్‌లో జరిగే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. మరోవైపు ఎన్నికల సంఘం రెండవ విడత పోలింగ్ కోసం కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపడుతోంది. మొదటిసారిగా కెమెరాలు అమర్చిన డ్రోన్లను ఉపయోగించడంతో పాటు 2 వేల 321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుంచి రెండు రోజుల పాటు సిక్కింలో పర్యటించనున్నారు. పాల్జోర్ స్టేడియంలో జరిగే సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన రేపు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, విద్యుత్, పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయం వంటి పలు రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు ఆ రాష్ట్రంలో సమ్మిళిత అభివృద్ధిని వేగవంతం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డాయి.

= = = = = = = = = = = = = = = = = = =

రాబోయే దశాబ్ద కాలంలో భారతీయ సాంకేతిక సామర్థ్యమే దేశ శక్తిని నిర్వచిస్తుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అమెరికా లాస్ ఏంజిల్స్‌లోని PAN-IIT పూర్వ విద్యార్థుల సదస్సు నుద్దేశించి ఈరోజు ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో భారతదేశం ముందు వరుసలో ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా చెన్నై వేదికగా ఈ సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ 16 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్

సాయి సుదర్శన్ 87 పరుగులతో రాణించాడు. అంతకుముందు 3 వికెట్లు తీసి చెన్నైను తక్కువ పరుగులకు కట్టడి చేయడంలో కీలకంగా వ్యవహరించిన గుజరాత్ బౌలర్ కగిసో రబాడా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =